# వింత వ్యాపారం

—పాలకూర సీతాలత

నటరాజుకి అర్జంటుగా టెలిగ్రాం ఇయ్యవల్సిన అవసరం కల్గింది. అందుకే పెద్ద పోస్టాఫీసులో అడుగుపెట్టాడు. లోపల జనం విపరీతంగా వున్నారు. ఏ కౌంటర్ దగ్గర చూసినా పెద్ద క్యూ... చిన్నగా మూలిగేడు.

"దేశంలో వున్న సమస్యలు అన్నింటికీ ముఖ్యకారణం జనాభా పెరుగుదల" అని తరుచు లెక్చరు యిస్తూండే అతని మిత్రుడు గుర్తువచ్చాడు. వాడి మాటల్లో నిజం లేకపోలేదు సుమా-అనుకున్నాడు.

టెలిగ్రాం కౌంటర్ ముందు నిలబడ్డాడు. ఒక నిముషం గడిచిందో లేదో ఒకవ్యక్తి అతని దగ్గరకు వచ్చి-

"ఎక్స్క్యూజ్‌మీ" అన్నాడు.

బిత్తరపోయాడు నటరాజు. "నువ్వు నాకు ఏం అపకారం చేశావని నాయనా నిన్ను క్షమించడం-నువ్వు ఎవరో నాకు తెలీదు. మొదటిసారి నీ ముఖం చూస్తున్నాను-" అనుకున్నాడు.

నటరాజు ఏదో ఆలోచనల్లో వుండటం వల్ల తన మాట విన్పించుకోలేదని అనుకున్న ఆ వ్యక్తి మరోసారి అన్నాడు.

"ఎక్స్క్యూజ్ మీ-"

"ఎందుకు?" అని ప్రశ్నించాడు నటరాజు.

"మీ పెన్ను ఒకసారి కావాలి-చిన్న ఉత్తరం రాసి ఇచ్చేస్తాను-" అన్నాడు ఆ వ్యక్తి.

తన జేబువంక చూసుకున్నాడు నటరాజు. అది అందరికీ కన్పిస్తోంది. అందుకే ఆ వ్యక్తి అలా అడిగేడు.

"నేను టెలిగ్రాం ఇయ్యాలి..." అన్నాడు నటరాజు.

"మీ వంతు రావడానికి చాలా టైం వుంది. ఈలోగా ఇచ్చేస్తాను-" అన్నాడు అతను.

ముక్కు, ముఖం తెలియనివాడికి తన పెన్ను ఇయ్యాలని లేదు నటరాజుకి. అందుకే ఏం వంకపెట్టాలా అని ఆలోచిస్తున్నాడు.

"ఇయ్యండి- ప్లీజ్-" అన్నాడు అతను. అతని వాలకం చూస్తుంటే మరి కాస్త ఆలస్యంచేస్తే చొరవగా అతనే తన జేబులోంచి పెన్ను తీసుకుంటాడని తోచింది నటరాజుకి. అయిష్టంగా పెన్ను తీసి ఇచ్చాడు. అది తీసుకుని అతను గుంపులో కలిసిపోయాడు. ఒక్కసారిగా

గుండె గుభేలుమంది నటరాజుకి. అతను పెన్ను తీసుకుని ఎటో పోయాడు. మళ్ళీ వచ్చి తనకు ఇస్తాడా? ఎనిమిది రూపాయల ఇంకు పెన్ను-

వెధవది- ఇలా పోస్టాఫీసుల్లో ఈ పెన్నుతాలూకు ముష్టి మరీ ఎక్కువైంది ఈ మధ్య. రోజుకి రెండు పేకెట్లసిగరట్ తాగేవాళ్ళు కూడా కనీసం ఒక రూపాయి ఖర్చుచేసి బాల్‌పాయింట్ పెన్ను వుంచుకోరు- అనుకున్నాడు.

ఇలాంటి వ్యక్తులు ఒకరో, ఇద్దరో అయితే ఫర్వాలేదు. కోకొల్లలుగా వున్నారు- అని పళ్ళు నూరుకున్నాడు.

'ఇంటింటా గ్రంథాలయం...', 'ఊరుకో బస్సు-' 'దొడ్డిదొడ్డికీ నుయ్యి-' లాంటి పథకాల్లాగా 'జేబు జేబుకీ ఒక పెన్ను' అన్న పథకం ప్రభుత్వం ప్రవేశ పెడితే తప్ప ఈ వెధవ సంత తప్పదు అనుకున్నాడు.

"క్యూ" ముందుకు నడుస్తోంది. అతను కౌంటర్‌కి దగ్గరవుతున్నాడు. అలా దగ్గరవుతున్నకొద్దీ పెన్ను గురించి ఆత్రం అతనిలో ఎక్కువ కాసాగింది. మరి రెండు నిముషాల తర్వాత ఆ వ్యక్తి వచ్చాడు. ఆ దేవదేవుడే తన ముందు ప్రత్యక్షం అయినంతగా పొంగిపోయేడు నటరాజు.

"థాంక్సండీ- ఇదిగో మీ పెన్ను-" అన్నాడు ఆ వ్యక్తి.

"ఓ-థాంక్యూ-థాంక్యూ సో మచ్-" అన్నాడు నటరాజు. అవతల వ్యక్తి ఆశ్చర్యపోయాడు.

"మీరు ఎందుకండీ నాకు థాంక్సు చెప్పడం-" అన్నాడు.

"నా పెన్నును నిజాయితీతో తిరిగి ఇచ్చినందుకు మీకు కృతజ్ఞతలు చెప్పుకోవడం నా ధర్మం. అందుకే అలా అన్నాను-" అన్నాడు నటరాజు.

ఆ వ్యక్తి మంచివాడుగానే అనిపించాడు నటరాజుకి. అవును మరి- పెన్ను తిరిగి ఇచ్చాడు కదా- అతను నమస్కారం చేసి వెళ్ళిపోయాడు.

'క్యూ'లో ముందుకు కదిలి టెలిగ్రాం ఇచ్చాడు నటరాజు. ఆ తర్వాత బయటకు వస్తుండగా మరొకవ్యక్తి అతని దగ్గరకు వచ్చి-

"శ్రమ కల్గిస్తున్నందుకు అన్యధా భావించకండి. ఒక్కసారి మీ పెన్ను ఇస్తారా?" అన్నాడు. అతని చేతిలో ఇంగ్లీషు నవల వుంది. దానిమీద 'జగదీశ్వర్' అని పేరు వుంది.

"మీ పేరు జగదీశ్వర్- అవునా-" అడిగేడు నటరాజు.

"అవును. మీ కెలా తెల్సు?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు జగదీశ్వర్.

"మీ చేతిలోవున్న నవల మీద ఆ పేరు వుంది- అంటే అర్థం ఆ నవల మీ స్వంతం- కదూ-" అడిగేడు నటరాజు.

"అవును-నేను ఇంగ్లీషు నవల్లు తెగ

చదువుతాము. నాకు అవంటే పిచ్చి- కొని మరీ చదువుతాము" అన్నాడు జగదీశ్వర్.

"మీకు పెన్ను అంటే కూడా పిచ్చి వుంటే బాగుండేది కాని- మరీ వారుకుని వుండేవారు-" అన్నాడు నటరాజు.

కొంచెం దెబ్బతిన్నాడు జగదీశ్వర్.

"నా పెన్ను ఆఫీసులో మర్చిపోయాము యం. వో. ఫారం నింపి ఇచ్చేస్తాము- ప్లీజ్-" అన్నాడు జగదీశ్వర్.

మనసులోనే తిట్టుకున్నాడు నటరాజు. ఇకముందు పోస్టాఫీసుకు వచ్చినప్పుడు తను కూడా పెన్ను తీసుకురాకుండ మరొకర్ని అడిగి పని జరుపుకోవాలను కున్నాడు.

అయిష్టంగా పెన్ను తీసి అతనికి ఇచ్చాడు. జగదీశ్వర్ 'థాంక్సు' చెప్పి ముందుకు కదిలాడు. తనకు ఎంత టైం వేస్టు! తన పని అయిపోయినా కూడా ఆ జగదీశ్వర్‌కి పెన్ను ఇచ్చిన కారణంగా ఇలాగే ఉండిపోవల్సి వచ్చింది తను చాలా తెలివైన పని చేశాడు. అతనికి పెన్ను ఇస్తున్నపుడు దాని 'కేప్' తీసి తన దగ్గరే వుంచుకుని పెన్ను మాత్రం ఇచ్చాడు. ఇక ఆ జగదీశ్వరుడు తన పెన్ను తీసుకుని ఉడాయిస్తాడన్న భయం వుండదు. మూతలేని పెన్ను ఎలా తీసుకెళ్ళగలడు కనుక!!

ఆ జగదీశ్వర్ తప్పకుండా పెన్ను తెచ్చి ఇస్తాడన్న నమ్మకంతో ఆలో చనల్లో మునిగిపోయిన నటరాజు. పది నిముషాల తర్వాత తేరుకున్నాడు. టైము చూసుకున్నాడు.

అరె! అతను ఇంకా రాలేదేం-


యం. వో. కౌంటర్ దగ్గర 'క్యూ'లో జగదీశ్వర్ కోసం వెతికాడు. అక్కడ కనపడలేదు. నటరాజు కొంచెం కంగారు పడ్డాడు. పోస్టాఫీసులో అన్ని కౌంటర్లూ చుట్టివచ్చాడు కానీ ఆ జగదీశ్వర్ కన పడలేదు.

మైగాడ్! వీడు ఎవడో తనకు బాగా టోపీవేశాడు- అని బాధపడ్డాడు. అతన్ని మనసులో బాగా తిట్టుకున్నాడు. అయినా ఆశ చావక అక్కడే మరో అరగంట వేపు గిరగిరా తిరిగేడు కానీ ఆ జగ దీశ్వర దర్శనం కాలేదు. అతని చేతిలో పెన్నుతాలూకు మూత అతన్ని వెక్కి రించింది.

వాడు ఉడాయించాడు. అందులో సందేహంలేదు-ఆ ఇంగ్లీషు నవలవాడు గొప్ప సంస్కారవంతుడు అని భ్రమ పడ్డాడు. ఇక తను అక్కడే వాడికోసం వెయ్యి కళ్ళతో ఎదురు చూడవల్సిన పనిలేదు.

అందుకే చిన్నగా నిట్టూర్చి బయటకు వచ్చాడు. బయట నిలబడి వచ్చేపోయే వాళ్ళవంక పరిశీలనగా చూడసాగేడు.

అబ్బే- తన పిచ్చిగానీ వాడు మరి తుపాకీ దెబ్బకు తగలకుండా ఉడాయిం చాడు. అలా చుట్టూ చూస్తుంటే 'పెన్ కార్నర్-' అని ఒక దుకాణం కనపడింది.




దాని ముందు ఒక బోర్డు వేళ్లాడుతోంది. ఆశ్చర్యం కల్గింది ఎందుకంటే ఆ బోర్డుమీద ఇలా రాసి వుంది—

"ఇచ్చట మూత లేని కలములు అమ్మబడును... కొనబడును... వట్టి మూతలు అమ్మబడును... కొనబడును..."

వెంటనే అటు నడిచాడు. ఈ వింత వ్యాపారం తాలూకు విశేషాలు తెలుసుకోవాలి అన్పించింది. అతను దుకాణంలోకి అడుగు పెట్టగా ఓ దుకాణం వ్యక్తి ఆహ్వానించాడు.

"రండి సార్... మీరు అమ్మడానికి వచ్చారా లేక కొనడానికా—?" అడిగేడు.

అందుకు జవాబు చెప్పకుండా ఆ వింత వ్యాపారం గురించి అడిగేడు. ఆ దుకాణంవాడు గొంతు సవరించుకొని-

"సార్... ఇది పోస్టాఫీసుకు దగ్గరగా వున్న దుకాణం కదా... పోస్టాఫీసులో పెన్నులు భలే వింతగా జారిపోతుంటాయి. ఒక వ్యక్తి పోస్టాఫీసులో మిమ్మల్ని పెన్ను అడిగాడనుకోండి. మీరు జాగ్రత్తకోసం దానిమూత మీ దగ్గరే వుంచుకుని పెన్ను మాత్రం ఇస్తాడు. అవతలివాడు నిజాయితీపరుడు ఐతే సరే... గొడవలేదు. అలా కాకుండా మూతలేని ఆ పెన్ను తీసుకొని వెళ్ళిపోయాడనుకోండి. దాన్ని నా దుకాణంలో అమ్మి డబ్బు చేసుకుపోతాడు. లేదా ఆ పెన్నుకు సరిపడా మూత కొనుక్కొని పెన్నుతోపాటు వెళ్ళిపోతాడు. అలాగే కేవలం మూత మిగుల్చుకున్న పెన్ను తాలూకు స్వంతదారు నా దగ్గరకు వచ్చి ఆ మూత అమ్మేసి వెళ్ళిపోతాడు. లేదా మూతలేని పెన్ను కొనుక్కొని వెళ్తాడు. నా బ్రాంచిలు ప్రతి పోస్టాఫీసు ముందూ వున్నాయి ఏదో మీ దయవల్ల బాగానే సాగుతోంది వ్యాపారం..." అన్నాడు.

అప్పటికి ఆ దేవరహస్యం అర్థం

అయినట్లు తల ఊపేడు నటరాజు.

"సార్...చెప్పండి...మీరు ఏంపని మీద వచ్చారు?" అడిగేరు దుకాణంవాడు.

గుప్పిటి తెరిచి అందులో వున్న పెన్ను మూత బయటపెట్టాడు అతను.

"ఓహో...అయితే మీరు పెన్ను పోగొట్టుకున్న బాపతన్నమాట..." అన్నాడు దుకాణంవాడు జాలిగా చూస్తున్న నటరాజు వంక.

నీరసంగా తల ఊపేడు నటరాజు.

"ఈ మూతకు సూటయ్యే మూత లేని పెన్నులు నా దగ్గర వున్నాయి కొనుక్కోండి. అందుకు ఇష్టం లేకపోతే మూత మాత్రం అమ్ముకానంటే నాకు అభ్యంతరం లేదు. ఏం చేస్తారు?" అడిగేడు.

"మూత అమ్మేస్తాను" అన్నాడు నటరాజు.

"అలాగే...కానీ ఒక్కసారి నా దగ్గర వున్న పెన్నులు చూడండి... నచ్చకపోతే మీ ఇష్టం వచ్చినట్లు అలాగే అమ్ముదురుగాని..." అంటూ తనదగ్గర వున్న మూతలేని పెన్నులు బయట పెట్టాడు దుకాణంవాడు.

నటరాజు దృష్టి ఒకచోట ఆగిపోయింది. ఒక మూత లేని పెన్ను అతనివైపు దీనంగా చూస్తోంది...అది అతను పోగొట్టుకున్న పెన్ను, దాన్ని చేతిలోకి తీసుకున్నాడు.

"పది నిముషాల క్రితం కొన్నాను దీన్ని. ఇది మీదే అయినా అందులో ఆశ్చర్యం లేదు. మూత తొడిగేడు. సరిగ్గా సరిపోయింది. సరిపోక ఏమౌతుంది."

"తీసుకోండి...రెండు రూపాయలకు కొన్నాను. నాకు రూపాయి లాభం. కనుక దీని ఖరీదు మూడు రూపాయలు" అన్నాడు దుకాణంవాడు.

"ఈ పెన్ను నీకు అమ్మడానికి వచ్చిన వ్యక్తి చేతిలో ఇంగ్లీషు నవల వుందా?" అడిగేడు నటరాజు.

"వుందండీ" అని జవాబు చెప్పాడు దుకాణంవాడు.

'జగదీశ్వరా...ఎంత పని చేశావురా' అనుకొన్నాడు నటరాజు.

పెన్ను జేబులో పెట్టుకుని మూడు రూపాయలు తీసి ఇచ్చేడు నటరాజు.

అతని ఆప్తమిత్రుడు ఒకడు తన గుర్తుగా ఆ పెన్ను ఇచ్చాడు నటరాజుకి. అందుకే అతను మూడు రూపాయలు ఖర్చుచేశాడు.

"వస్తాను" అన్నాడు నటరాజు దుకాణంవాడితో.

"వట్టినే అనడం కాదు. తరుచు నిజంగా వస్తుండండి. మూత లేని పెన్ను కొనుక్కుందుకు కాకపోయినా...మూత లేని పెన్ను అమ్మడానికి అయినా సరే" అన్నాడు దుకాణంవాడు నవ్వుతూ.

---